
సాక్షి
పల్నాడు
బుధవారం । 15 । మే । 2024



మహాకాళేశ్వరా నమో


ఫిరంగిపురం: వేమవరం కోటి ఒక్కలింగాల క్షేత్రంలోని మరకత లింగానికి మంగళవారం భక్తులు పూజలు చేశారు. మహాకాళేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం చేశారు.



19 నుంచి పోలేరమ్మ తల్లి జాతర

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వేమవరంలో కొలువైన పోలేరమ్మ తల్లి జాతర ఈ నెల 19, 26 తేదీలలో జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

22 నుంచి గుండి పార్వతి తిరునాళ్ల



భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ స్మశానవాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారి తిరునాళ్ల ఈ నెల 22, 23 తేదీలలో నిర్వహించనున్నట్లు కాపు సంఘం, నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎం యంత్రాలు



నరసరావుపేటరూరల్: కాకాని జేఎన్‌టీయూ ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎం యంత్రాలు చేరుకున్నాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎం యంత్రాలను కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. మంగళవారం స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎన్నికల పరిశీలకులు బూరే సర్వేశ్వరనరేంద్ర, శ్రీహరి ప్రతాప్‌సింగ షాహిలు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

నరసరావుపేటలో 144 సెక్షన్ అమలు



నరసరావుపేటటౌన్: హింసాత్మక ఘటనల నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ వి.ఎస్.ఎన్.వర్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలపై పార్టీల జెండాలు పెట్టుకొని తిరగటం నిషేధమన్నారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టే విధంగా పాటలు, కవింపు చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన కూడళ్లలో నలుగురికి మించి ఉండరాదన్నారు. జనం ఎక్కువగా ఒక ప్రాంతంలో గుమికూడితే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్, మల్లికార్జునరావు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

నకరికల్లు: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఎస్ఐ పి.రాంబాబు మంగళవారం తెలిపారు. సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, ప్రజలకు భయభ్రాంతులకు గురిచేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకొని ప్రజలు ఎవరి ఇళ్లలో వారు ఉండాలన్నారు. నలుగురు అంతకన్నా ఎక్కువ మంది ప్రజలు రోడ్లపైకి గుంపుగా రాకూడదని అన్నారు.

సంతగుడిపాడులో పోలీసు కవాతు



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం పోలీసులు, బీఎస్ఎఫ్ దళాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల అనంతరం ఆ గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వచ్చే నెల 4 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. రాజకీయపార్టీల నాయకులు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు రాజకీయపార్టీల నాయకులు, ప్రజలు సంయమనం పాటించాలన్నారు.

రెండు గ్రామాల్లో పోలీసు పికెట్

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, వేల్పూరు గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఆయా గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషనులో ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం జనసేన, కాంగ్రెసు పార్టీలకు చెందిన వారం దరూ పాత కక్షలు మనసులో పెట్టుకొని కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఇరు పార్టీలకు చెందిన వారిని చెదరగొట్టారన్నారు. ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయన్నారు. ఎన్నికల సందర్భంగా అన్నీ పార్టీలకు చెందిన నాయకులు సంయమనం పాటించాలన్నారు.

‘దేశం’ దమనకాండ

పల్నాడులో టీడీపీ అరాచక శక్తుల దాడులు కొనసాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం టీడీపీ అరాచక శక్తులు రెచ్చిపోయి విధ్వంసం సృష్టించాయి. భయానక వాతావరణం కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో వందలాది మంది గాయపడ్డారు. అంతటితో ఆగకుండా మంగళవారం కూడా దాడులు కొనసాగించారు. ఇళ్లపై పడి ఆస్తులను ధ్వంసం చేశారు. పార్టీకి చెందిన పురుషులు గ్రామాలు వదిలి పారిపోయారు. మహిళలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

పల్నాట కొనసాగుతున్న టీడీపీ దాడులు

- పట్టించుకోని పోలీసులు
- గాయపడ్డ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు
- భయం గుప్పెట బాధితులు

తొండపి(ముప్పాళ్ల): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మొదలైన టీడీపీ అరాచక శక్తుల దాడులు గ్రామాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా టీడీపీ వర్గీయులు భౌతికదాడికి పాల్పడుతున్నారు. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల వరకు మాదల గ్రామంలో రాళ్ల దాడి కొనసాగింది. మంగళవారం ఉదయం తొండపి గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ముస్లిం వర్గీయుల ఇళ్లలోకి టీడీపీ సానుభూతిపరులు మూకుమ్మడిగా చొరబడి మహిళలను, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేశారు. విలువైన సామాగ్రిని ధ్వంసం చేశారు. టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లలోకి చొరబడి రెండు గంటలపాటు భయోత్పాతం సృష్టించారు. దాడిలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇంట్లోని సామగ్రి పగలకొట్టారు. రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలను భయభ్రాంతులకు గురిచేశారు. దాడికి పాల్పడుతున్న తరుణంలో ముస్లిం కుటుంబాల్లోని పురుషులు ప్రాణాలు కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీశారు. మహిళలు, చిన్నారులు తలుపులు వేసుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉండిపోయారు. టీడీపీ వర్గీయుల దాడితో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారిపోయింది.

రాళ్లతో నిండిన రహదారులు

ఎన్నికల ముగిసినప్పటి నుంచి మాదల గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆరంభమైన గొడవ సాయంత్రానికి రాళ్ల దాడికి దారి తీసింది. ఎన్నికల అనంతరం రాత్రి 11గంటలకు ఇళ్లకు చేరిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పరస్పరం రాళ్ల దాడికి దిగారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు రాళ్ల దాడి కొనసాగింది. దాడిలో ఉపయోగించిన రాళ్లతో ఆ ప్రాంతంలోని రహదారులన్నీ నిండిపోయాయి.

పోలీసు పికెట్‌లు ఏర్పాటు

మండలంలోని తొండపి, మాదల గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై పీ.హాజరతయ్య మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేర పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. రెండు గ్రామాల్లోనూ పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు పోలీస్ పికెట్ కొనసాగుతుందన్నారు. గ్రామస్తులు కూడా పోలీసులకు సహకరించాలన్నారు.

పేరూరుపాడులో రాళ్లు, కర్రలతో దాడి

బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై టీడీపీ అరాచక దాడులకు పాల్పడ్డారు. సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం తెలుగు దేశం పార్టీ వర్గీయులు గ్రామంలో రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేశారు. దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్నారు. వీరిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఏర్పడిన స్వల్ప వివాదంతో కావాలనే టీడీపీ నాయకులు పథకం ప్రకారం రాళ్లు, కర్రలతో దాడులకు దిగారు. రాత్రి వేళ తొలుత మట్టి వలరాజ ఇంటిలోకి ప్రవేశించి విచక్షణ రహితంగా దాడి చేసి మట్టి నాగేంద్రబాబును బయటకు లాగి కర్రలతో కొట్టారు. మట్టి నాగేంద్రంబాబు, దొండపాటి శ్రీను, పేదపోతుల వెంకటేశ్వర రెడ్డి, నారాయణరెడ్డిలకు తీవ్రగాయాలు కాగా కె.లింగమ్మ దాడిలో గాయపడ్డారు. వీరితోపాటు మరో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి దాడులను నిలువరించారు.







దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న నాగేంద్ర బాబు, మల్లంపాటి చెంచిరెడ్డి, దొండపాటి శ్రీను



అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కాజా ఆదిశేషమ్మ,

సర్పంచ్ కుటుంబమే లక్ష్యంగా టీడీపీ దాడులు

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం కంభంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ సర్పంచ్ ఆర్తిమళ్ల నాగేశ్వరరావు (నాగయ్య) ఆయన సతీమణి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఆర్తిమళ్ల అంజిమ్మ లక్ష్యంగా సోమవారం అర్ధరాత్రి సమయంలో టీడీపీ కార్యకర్తలు, నేతలు ఒకసారిగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ముగిసి బ్యాలెట్ బాక్స్‌లు తరలించిన తరువాత ఒకసారిగా పచ్చ మూకలు నాగేశ్వరరావు, వారి కుమారులు రాజశేఖర్, ప్రవీణ్, ఆర్తిమళ్ల తిరుపతరావు, ఎస్సీ కాలనీకి చెందిన సురేష్, బీసీ కాలనీకి చెందిన బ్రహ్మం, మహిళ పల్లపాటి కృష్ణవేణిలపై దాడులకు పాల్పడ్డారు. తలకు, కాళ్లకు, చేతులకు, ఛాతీలపై గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పలుమార్లు ఎస్సీ, బీసీ కాలనీలకు వెళ్లి అక్కడ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

ఓటమి భయంతోనే దాడులు : నంబూరు

పెదకూరపాడు నియోజకవర్గంలో ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు దాడులకు తెగబడ్డారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు.



దాడిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

టీడీపీ కార్యకర్తల దాడుల్లో గాయపడిన కంభంపాడు సర్పంచ్ నాగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు, అనుచరులను ఆయన మంగళవారం పరామర్శించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం కావడంతో దాడులకు తెరలేపారన్నారు. దాడులకు కారకులపై వెంటనే పోలీసులు కేసులు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

నూజెండ్లలో 15 మందికి గాయాలు

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే బొల్లా



జక్కిరెడ్డి గోవిందరెడ్డి



అమ్మిరెడ్డి సంజీవరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ఎన్నికలు పూర్తయిన మరుసటిరోజు మంగళవారం పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన సెంటరులోకి వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై రాళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. దాడిలో 15 మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. మహిళలపైనా దాడులకు తెగబడ్డారు. గ్రామంలో అందరూ కలసి కట్టుగా ఎన్నికల్లో పాల్గొన్నారనే అక్కసుతో ఎలాగైనా వాళ్లపై దాడులు చేయాలనే ముందస్తు ప్రణాళిక ప్రకారం పక్క గ్రామాల నుంచి కూడా టీడీపీ నాయకులు కలసి వచ్చి దాడులకు పాల్పడ్డారు. పోలీసులు సమాచారం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ అదుపు చేయలేకపోయారు. టీడీపీ మూకల దాడుల్లో గ్రామానికి చెందిన కాజా దిశేషమ్మ, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జక్కిరెడ్డి గోవిందరెడ్డి, అమ్మిరెడ్డి సంజీవరెడ్డి, భవనం సంజీవరెడ్డి, మల్లంపాటి చెంచిరెడ్డి, నక్కా ఆదిలక్ష్మి, కాజా జయమ్మ, వంగూరి ప్రసాదు గాయపడ్డారు. క్షతగాత్రులను వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నారు. బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బొల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్థానిక ఎమ్మెలే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. టీడీపీ నాయకులు కావాలనే దాడులకు పాల్పడుతున్నారని. కార్యకర్తలు ఎవరూ భయపడవద్దని పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న దాడులకు రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

కొత్తగణేశునిపాడులో ఇళ్లపై దాడులు



కొత్త గణేశునిపాడులో మాట్లాడుతున్న బాధిత మహిళలు

మాచవరం: వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓట్లు వేశారనే అక్కసుతోనే టీడీపీ నాయకులు పొరుగు ఊళ్ల నుంచి రౌడీలను, గూండాలు తీసుకువచ్చి గురజాల నియోజకవర్గం మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామంలో ఇళ్లపై దాడులు నిర్వహించారు. మోటారు బైకులను, ఆటోలను, ఇళ్లలోని సామాన్లను, టీవీలు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఆడవాళ్లు, పిల్లలు అనే కనికరం లేకుండా బూతులు తిడుతూ, భౌతికదాడులు చేశారు. గ్రామంలోని వైఎస్సార్ సీపీకి చెందిన వారు పొలాల్లోకి పరుగులు పెట్టి, అర్ధరాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. మహిళలు గంగమ్మ గుడిలో తలదాచుకున్నారని తెలిసి, దేవాలయంపైకి రాళ్లు విసురుతూ భయకంపితుల్ని చేశారు. పోలీసులకు సంఘటన విషయం తెలిసినా గ్రామం వైపు చూడలేదు. బాధిత మహిళలు మాట్లాడుతూ ఎంతో కాలంగా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటున్నామని, పోలింగ్ రోజున ఫ్యాన్ గుర్తుకి ఓట్లు వేశామని ఓర్వలేక వైఎస్సార్ సీపీ వారి ఇళ్లపై దాడులు చేశారని కన్నీరు పెట్టారు. ఆడవాళ్లు, పిల్లలు అనే కనికరం లేకుండా దాడి చేశారని అన్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో గంగమ్మ తల్లి దేవాలయంలో దాక్కున్నామని, అన్నం, నీళ్లు లేక అల్లాడిపోయామని కన్నీరు పెట్టారు. కనీసం ఒక్క పోలీసైనా గ్రామంలోకి రాలేదని, పోలీసులు వచ్చి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

పేదలపై టీడీపీ గూండాయిజం

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు బాలచంద్రనగర్ (పోతురాజుగుట్ట)లో నివాసం ఉంటున్న బేడ బుడ్గ జంగాలు తమకు ఓటు వేయలేదని ఆగ్రహించిన టీడీపీ గూండాలు సుమారు 70 మంది వారి ఇళ్లపై పడి కనపడిన వారిని కనపడినట్లు కర్రలు రాళ్లతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా చావబాదారు. ఇళ్లలోని సామాన్లు, చివరకు ఫ్యాన్లు, బల్బులను పగులగొట్టారు. చిల్లర కొట్టును లూటీ చేశారు. అందులోని చిల్లర సామగ్రి, నగదు దోచుకెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెల్లూరి కోటయ్యకు చెందిన వాహనాన్ని ధ్వంసం చేశారు. కర్రలు, రాళ్లతో వాహనం అద్దాలను పగులగొట్టారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెల్లూరి బిక్షంకు చెందిన బైక్‌ను, మక్కెన శేషుకు చెందిన బైక్‌ను, మరో ఇద్దరి ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. పెల్లూరి పెదలింగయ్య, బిక్షం, పెదకోటయ్య నివాసలలో టీవీలు, ఫ్రిజ్‌లు, మిక్సీలు ఇతర సామగ్రి పగలుగొట్టారు. ఈ సమయంలో కన్పించిన గొర్ల సైదులు చేయి, కాలిపై కర్రలతో బాదారు. కత్తెర లక్ష్మీ చేయి విరగొట్టారు. గొర్ల సైదులు, తిరుపాలు, లింగప్ప, చిలకమ్మలను కొట్టడంతో గాయలపాలయ్యారు. రాళ్ల దాడితో అందరూ ప్రాణభయంతో ఇంటి నుంచి పరుగులు తీసి పారిపోయి వేరే చోట తలదాచుకున్నారు. దాడుల్లో 60 నుంచి 70 మంది దాకా ఉన్నారని పెల్లూరి బిక్షం తదితరులు తెలిపారు. అధికారంలోకి వచ్చాక మీ అంతు చూస్తామని బెదిరించారన్నారు.

ముసలోళ్లమని కూడా చూడలేదు..



అయ్యా.. ఇళ్ల మీద పడి కనపడినవారిని కనపడినట్లు కర్రలతో కొట్టారు. ఇళ్లలోకి జొరబడి సామాన్లన్నీ చిందవందర చేశారు. కొన్నింటిని పగులగొట్టారు. నా చేయి, కాలుపై కర్రలతో కొట్టారు. ముసలోళ్లమని కూడా చూడలేదు, భయమేసింది. ఇళ్లలో పిల్లలందరూ పరారయ్యారు. ఎటూ పోలేని మమ్మలను మాత్రం కర్రలతో కొట్టారు. అమ్మనాబూతులు తిట్టారు.

– గొర్ల సైదులు, కాలనీవాసి, పోతురాజుగుట్ట, జంగాల కాలనీ

నా చిల్లర కొట్టు ధ్వంసం చేశారు..



అయ్యా.. మా జీవనాధారమైన చిల్లర కొట్టును ధ్వంసం చేశారు. ఫ్యాన్లు, ఫ్రిజ్ పగులగొట్టారు. కొట్లో ఉన్న సామాన్లను పట్టుకుపోయారు. నగదు కూడా దోచుకెళ్లారు. మా అబ్బాయి బండి పగుల గొట్టారు. మా వాడు ఇంట్లో నుంచి ప్రాణ భయంతో ఎటు పోయాడో తెలియడం లేదు. ఇదేమి దారుణమయ్యా. మా మానాన మేం బతుకుతుంటే వీరి దౌర్జన్యం ఏమిటి. వారి మాటే విని టీడీపీకి ఓటు వేయలేదని ఇలా చేశారు.

– పెల్లూరి ఈదమ్మ, పోతురాజుగుట్ట, జంగాల కాలనీ

బాధితులకు ఎమ్మెల్యే నంబూరు పరామర్శ



సత్తెనపల్లిలో చికిత్స పొంతున్న మహిళను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కొత్తపల్లి, వేల్పూరు గ్రామాల వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సజావుగా జరుగుతున్న పోలింగ్‌ను చెడగొట్టేందుకు టీడీపీ వర్గీయులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేశారన్నారు. టీడీపీ ఆటంకాలు సృష్టించినా ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. పోలింగ్ శాతం పెరిగితే వైఎస్సార్ సీపీకి అనుకూలంగా మారుతుందన్న దురుద్దేశంతోనే టీడీపీ అల్లరి మూకలు రాళ్లు రువ్వడం, కర్రలతో దాడులకు పాల్పడినట్లు చెప్పారు. దాడుల్లో వేల్పూరు, కొత్తపల్లి ఎస్సీ కాలనీలకు చెందిన కొంతమంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. తక్షణమే వారిని సత్తెనపల్లి వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నామని చెప్పారు. టీడీపీ వారు ఎంత రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు, పోలింగ్ శాతాన్ని పెంచుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తాను అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు

- చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్
- పార్టీ అండగా ఉంటుందని భరోసా

నరసరావుపేట: జూన్ నాలుగు తర్వాత వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేసిన టీడీపీ వ్యక్తులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా టీడీపీ మూకల దాడిలో గాయపడి నరసరావుపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు నాయకులు, కార్యకర్తలను మంగళవారం పరామర్శించారు. బంధువుల ద్వారా జరిగిన సంఘటనను తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా యువజన అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, డాక్టర్ గజ్జల సుదీర్ భార్గవరెడ్డి, మారూరి రామలింగారెడ్డి, పలువురు పల్నాడు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కార్యకర్తను పరామర్శిస్తున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్

క్లుప్తంగా

కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలక పాత్ర



నరసరావుపేటటౌన్: కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలక పాత్ర అని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ అన్నారు. మధ్యవర్తిత్వంపై మంగళవారం బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు, ప్రొఫెసర్స్, ఎన్‌జీవోలు, న్యాయవాదులు మధ్యవర్తిత్వంగా వ్యవహరించేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు మండల న్యాయ సేవాధికార సంస్థలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. న్యాయస్థానంలో కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలక పాత్ర అన్నారు. మధ్యవర్తిగా ఎంపికైన సభ్యులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. న్యాయమూర్తులు ఆశీర్వాదం పాల్, మధుస్వామి, టి.ప్రవల్లిక, న్యాయవాద సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో 'విజ్ఞాన్' ప్రతిభ

గుంటూరుఎడ్యుకేషన్: సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో గుంటూరు విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పరీక్షలు రాసిన 126 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. జి.అమర్‌నాథ్ 500 మార్కులకు 473, శ్రియా రాథోడ్ 462, ఎండీ అర్షద్ అహ్మద్ 458, ఎం.హరీష్ 443మార్కులు సాధించారని, 20 మంది 400కుపైగా మార్కులు సాధించారు.

జిల్లాలో పోలింగ్ 85.69 శాతం

- పురుషుల కంటే మహిళలు 31,440మంది అధికంగా ఓటు
- ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చిన అధికారులు
- అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తం
- అభ్యర్థుల విజయాలపై చర్చోపచర్చలు
- పోలింగ్ వివరాలు తెప్పించుకుంటున్న అభ్యర్థులు

నరసరావుపేట: రెండేళ్ల కిందట ఏర్పడిన పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో జిల్లా ఓటర్లు 85.69శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 17,34,858 మంది ఓటర్లు ఉండగా వారిలో 14,86,594 మంది ఓటు వేశారు. వీరిలో పురుషుల కంటే మహిళలు అధికంగా 31,440మంది ఓటు వేయటం విశేషం. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఓటర్లు ఓట్లు వేసిన ఈవీఎంలను నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామం వద్దనున్న జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో మంగళవారం పోలింగ్ అధికారులు భద్రపర్చారు. దీనిని జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, సాధారణ ఎన్నికల పరిశీలకులు శ్రీ భూరే సర్వేశ్వర్ నరేంద్ర, శ్రీహరి ప్రతాప్‌సింగ్ షాపీ, ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ పర్యవేక్షించారు. ఎక్కడ చూసినా ఇద్దరు వ్యక్తులు తారసపడినా అభ్యర్థుల గెలుపు, ఓటమిలపైనే చర్చ చేస్తున్నారు.


స్ట్రాంగ్‌రూమ్‌కు వేసిన సీలును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా ఏఏ గ్రామాల్లో ఎంత శాతం పోలింగ్ జరిగింది, ఎన్ని ఓట్లు తమకు పడ్డాయో వివరాలు తెలుసుకుంటున్నారు. ఏడు నియోజకవర్గాల్లో ఓటు వేసిన పురుషులు, మహిళల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన పురుషుల ఓట్లు	పోలైన మహిళల ఓట్లు	ఇతరులు	పోలైన మొత్తం	శాతం
పెదకూరపాడు	2,33,453	1,01,833	1,05,469	05	2,07,307	89.18
చిలకలూరిపేట	2,26,646	93,150	1,00,472	32	1,93,654	85.44
నరసరావుపేట	2,32,778	92,040	96,646	15	1,88,701	81.06
సత్తెనపల్లి	2,42,047	1,03,116	1,07,381	03	2,10,500	6.97
వినుకొండ	2,64,559	1,16,772	1,19,263	01	2,36,036	89.22
గురజాల	2,73,971	1,12,704	1,18,219	22	2,30,945	84.30
మాచర్ల	2,62,404	1,07,903	1,11,538	10	2,19,451	83.63
మొత్తం	17,34,858	7,27,518	7,58,958	88	14,86,594	85.69

వైఎస్సార్ సీపీ నేతల ఇళ్లపై దాడి

- ఇంట్లో ఫర్నిచర్ ధ్వంసం
- పలువురికి గాయాలు

దాచేపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై టీడీపీ నాయకులు దాడులు చేశారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లా శ్రీనివాసరావు, చుండు రామారావు ఇళ్లపై సోమవార రాత్రి 11గంటల సమయంలో టీడీపీ నాయకులు రాళ్లు విసిరారు. ఇళ్లపై రాళ్లు విసరటంతో అద్దాలు పగిలాయి. ఇళ్లలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ నేత చుండు రామారావు తండ్రి వెంకటేశ్వర్లు, తల్లి లచ్చమ్మతోపాటుగా మరో ఇద్దరిపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు. టీడీపీ నేతల దాడితో భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. టీడీపీ నేతల దాడిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. మండలంలోని తంగెడ, ఇరికేపల్లి, దాచేపల్లి గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకులు పోకడలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కారెంపూడిలో టీడీపీ రౌడీ మూకల బీభత్సం


కారెంపూడిలో పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు


దాడులు చేస్తున్న టీడీపీ అల్లరి మూకలు

కారెంపూడి: కారెంపూడిలో టీడీపీ గూండాలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బీభత్సం సృష్టించారు. టీడీపీ నాయకులు రౌడీ మూకలను రప్పించి కారెంపూడిలో అల్లకల్లోలం సృష్టించారు. సుమారు 500 మంది రౌడీలు స్థానిక టీడీపీ నాయకుల నాయకత్వంలో బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ కరీంకు చెందిన వాచ్ షాపును ధ్వంసం చేశారు. కర్రలు, రాడ్‌లతో భయానక వాతావరణం సృష్టిస్తూ గ్రామం మొత్తాన్ని భయాందోళనలకు గురి చేశారు. ప్రజలు తలుపులు వేసుకుని తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారు మరింత రెచ్చిపోతూ కనపడిన వారినల్లా కొడుతూ భయకంపితులను చేశారు. స్థానిక కొట్ల బజారులో వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి చీతిరాల వెంకటకోటేశ్వరరావు నివాసంపై దాడి చేశారు. రాళ్లు వేస్తూ ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రికి చెందిన పాలకేంద్రాన్ని ధ్వంసం చేసి తగల బెట్టారు. తర్వాత మాచర్ల రోడ్డులో ఉన్న పోలిరెడ్డికి చెందిన టీ స్టాల్‌పై దాడి చేసి ధ్వంసం చేశారు. అరుపులు, కేకలతో లూథరన్ చర్చి వద్ద ఎస్సీ కాలనీ మొత్తం అరుపులు కేకలతో బీభత్సం సృష్టించారు. తర్వాత వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి చొరబడి కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. తర్వాత జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ నివాసంపై దాడి చేశారు. అక్కడ నుంచి స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో ఉన్న ఎంపీటీసీ వేముల పద్మావతి భర్త నిర్వహిస్తున్న ఆటో కన్సల్‌టెన్సీపై దాడి చేశారు. అక్కడ ఉన్న 40 బైక్‌లకు నిప్పు పెట్టారు. బైక్‌లకు ఉన్న బ్యాటరీలు పేలడంతో దానికి ఆనుకుని ఉన్న నివాసప్రాంత ప్రజలు తీవ్రభయాందోళనలకు గురయ్యారు. తర్వాత ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న అపార్టుమెంట్‌లో నిలిపి ఉంచిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి కారును ధ్వంసం చేశారు. అరుపులు, కేకలతో టీడీపీ గూండాలు అరాచకం సృష్టించారు. మరో బ్యాచ్ ఆర్యవైశ్య వీధి ముస్లిమ్ ఏరియాలో ప్రజలను భయాందోళనకు గురిచేశారు. తర్వాత గ్రామ శివారులో ఉన్న ఆదినారాయణ కాలనీకి చేరుకున్న టీడీపీ కిరాయి గుండాలు అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ నివాసానికి నిప్పు పెట్టారు. అందరిని భయకంపితులను చేశారు. అక్కడ కూడా చంపేస్తాం నా కొడకల్లారా అంటూ బీభత్సం సృష్టించారు. ఎంత మంది సీఆర్‌పీఎఫ్ పోలీస్ బలగాలున్నా పరిస్థితి అదుపులోకి రాలేదు. రాత్రి జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కారెంపూడిని టీడీపీ గుండాలు వణికించారు. గుండాలు కారెంపూడి మీద పడడం ఏమిటని ప్రజల్లో అలజడి ప్రారంభం కావడంతో అప్పుడే గ్రామ ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించేందుకు సిద్ధమయ్యే పరిస్థితులో జిల్లా ఎస్పీ రాకతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయితే ఇంత చేస్తున్నా టీడీపీ గుండాలను ఎవరూ కూడా నిలువరించలేకపోయారు. ఇదిలా ఉంటే మధ్యాహ్నం జరిగిన గుర్తు తెలియని వ్యక్తుల రాళ్ల దాడిలో కారెంపూడి సీఐ నారాయణ స్వామి తలకు బలమైన గాయమైంది. జెడ్పీ హైస్కూల్ వద్ద పార్క్ చేసి ఉన్న టీడీపీ నాయకుని స్కార్పియోను దుండగులు ధ్వంసం చేశారు.

మాచర్లలో ఆగని దాడులు


దగ్ధం అవుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుని బైక్ కన్సల్‌టెన్సీ


వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్‌లు దహనం

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నాయకుల దౌర్జన్యకాండ ఆగలేదు. కారంపూడి మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ అరాచకశక్తుల దాడిలో గాయపడిన పలువురిని పరామర్శించేందుకు ఎమ్మెల్యే పీఆర్కేతోపాటు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లారు. వీరిని చూసిన వెంటనే కారంపూడి పట్టణ శివారులో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. దాడిలో పీఆర్కే వెంట ఉన్న కార్యకర్తలు గాయపడ్డారు. కొంత మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీ కార్యాలయంలోకి వెళ్లి కుర్చీలు, ఫర్నీచర్ ధ్వంసం చేసి, దాడికి పాల్పడిన వారి కోసం వెతకడం ప్రారంభించారు. కారంపూడి సీఐ నారాయణస్వామి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్తుతెలియని దుండగులు రాయి విసరగా సీఐ నారాయణస్వామి తలకు గాయమైంది. పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై లాఠీచార్జి చేశారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే పీఆర్కే, సోదరుడు పీవీఆర్‌లు వెనుదిరిగి మాచర్ల వెళుతున్న సమయంలో కొన్ని ప్రాంతాల్లో వీరిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అదే ప్రాంతంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని టీడీపీ గుండాలు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై టీడీపీ గుండాలు దాడులు చేసి భయాందోళన సృష్టించారు. పీఆర్కే, పీవీఆర్‌లు పోలీసు బందోబస్తు నడుమ మాచర్ల పట్టణానికి తీసుకొచ్చి హౌస్ అరెస్టు చేశారు. గుర్తుతెలియని గూండాలు ఎమ్మెల్యే పీఆర్కే, సోదరుడు పీవీఆర్‌లపై రాళ్లు రువ్వి విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేశారు.

సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ

సంఘటన తెలుసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హుటాహుటిన చేరుకుని స్పెషల్ ఫోర్స్ సిబ్బందిని రంగంలో దింపారు. ఎమ్మెల్యే పీఆర్కే, పీవీఆర్‌ల ఇళ్ల ముందు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎక్కడా అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా షాపులు మూయించి ఎవ్వరిని రోడ్డుపై తిరగకుండా చర్యలు చేపట్టారు.

పీఆర్కే, పీవీఆర్ ఇళ్ల వద్ద బందోబస్తు

రెచ్చగొడుతున్న బ్రహ్మారెడ్డి

కారంపూడి మండలం బయల్దేరిన జూలకంటి బ్రహ్మారెడ్డి ఒప్పిచర్ల గ్రామం వద్ద టీడీపీ నాయకులతో మాట్లాడి రెచ్చగొట్టి మాచర్లకు తరలిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు వారిని కట్టడి చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే బ్రహ్మారెడ్డి సెల్‌ఫోన్ లొకేషన్ తెలియకపోవడంతో ఆయనను అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. మాచర్ల పట్టణంలో మే 12 నుంచి 14వ తేదీ వరకు 23 కేసులు నమోదు చేశారు. 53 మంది దాడుల్లో గాయపడ్డారు. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేత ఫ్యాక్షనిస్టు అయిన బ్రహ్మారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతోపాటు, ఆర్థికంగా బలవంతుడిని చేసి, నాలుగుసార్లు విజయం సాధించిన పీఆర్కే కుటుంబాన్ని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసి, దెబ్బతీయాలనే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో గొడవలు జరిగాయి. మాచర్ల పట్టణంలో ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే దాడులు

- రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ దాడులు
- కార్యకర్తలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు అనుకున్న విధంగానే ప్రజలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడటం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలను టార్గెట్ చేసుకుని దారుణంగా గ్రామాల్లో దాడులు చేయడాన్ని ఎమ్మెల్యే బొల్లా తీవ్రంగా ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ నూజెండ్ల మండలం రెడ్డికొత్తూరు గ్రామంలో జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య రెడ్డి సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్న బూత్‌లో పోలింగ్ ఆపాలని పక్క గ్రామాలైన చెరుకుంపాలెం, జెడ్డావారిపాలెం, గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తన అనుచరులతో గ్రామస్తులపై దాడులు చేయడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ తరపున గెలిచి టీడీపీలో చేరి తనకు ఓట్లు వేసిన వారిపైనే దాడులు చేయడం నీచ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు జీ.వి, మక్కెన ఆదేశాల మేరకే దాడులు

ప్రశాంతంగా ఉన్న వినుకొండ నియోజకవర్గంలో దాడులు చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి రాజకీయ లబ్ధి కోసమే దాడులకు కుట్ర చేశారని బొల్లా ఆరోపించారు. నూజెండ్ల మండలం జంగాలపల్లి, బొల్లాపల్లి మండలంలోని గ్రామాల్లో కూడా మాజీ ఎమ్మెల్యేలు దాడులను ప్రేరేపించారని విమర్శించారు. వారి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అమాయకులైన ప్రజలను పావులుగా ఉపయోగించుకుంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వారి కుట్రలకు బలికావద్దని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటామని వారి దాడులకు భయపడేది లేదని కార్యకర్తల తరపున న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. ఇదిలా ఉంటే పల్నాడు జిల్లావ్యాప్తంగా పోలీసులు కూడా ఒకే వైపు కొమ్ముకాశారన్నారు. దాడులు జరుగుతున్నా ప్రేక్షక పాత్ర వహించడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల జరిగిన తరువాత రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారని ఇకనైనా గొడవలు ఆపాలన్నారు. ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు కర్రలు పట్టుకుని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని, శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో ఎస్సీలపై దాడులు చేవారని అన్నీ ఆధారాలు ఉన్నాయని చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకునే విధంగా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, బీసీ నాయకులు సునీల్ యాదవ్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

టీడీపీ అరాచకాన్ని సమర్థంగా ఎదుర్కొంటాం

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి


జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నాయకుల అరాచకాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపుఇచ్చారు. సోమవారం పోలింగ్ జరుగుతుండగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి గృహంపై టీడీపీ వర్గీయులు దాడిచేయటంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణం నుంచి వందలాది మంది కార్యకర్తలు సోమవారం రాత్రికి ఎమ్మెల్యే గృహం వద్దకు భారీగా చేరుకున్నారు. ఈ సమయంలో మళ్లీ మరోసారి ఎమ్మెల్యే గృహంపై దాడిచేయాలనే ఆలోచనతో అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన కార్యకర్తలను పిలిపించుకున్నాడనే సమాచారంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ కూడా అక్కడకు చేరుకున్నారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సంఘటనా స్థలానికి చేరుకొని నాయకులతో చర్చలు జరిపారు. ఇరువర్గాలను శాంతించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇవ్వటంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శాంతించారు. వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ జరిగిన దానికి తగిన సమాధానం తప్పకుండా చెబుతామని అప్పటివరకు శ్రేణులు శాంతించాలని కోరారు.

బడుగులపై దాడులా!


బాధిత మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్

టీడీపీ నేతలకు సిగ్గుండాలి

- ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది
- దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- గురజాల ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్

మాచవరం: వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనే అక్కసుతో బడుగు, బలహీన వర్గాలపై దాడులు చేయడం సిగ్గుచేటని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మాచవరం మండలం కొత్త గణేశునిపాడు గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ పచ్చమూకలు దాడి చేసిన నేపథ్యంలో గంగమ్మ గుడిలో తల దాచుకున్న బాధిత మహిళలను మంగళవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అనుకూలంగా ఉన్నామనే అక్కసుతో మా ఇళ్లపై దాడులు చేసి, మా ఇంటిపెద్ద దిక్కు అయిన మగవారిని కొట్టి తరిమి వేశారని, అంతేకాకుండా మా ఇళ్లను ధ్వంసం చేశారని, ఆటోలను, బైకులను, ఇళ్లలోని వస్తువులను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారని బాధిత మహిళలు వాపోయారు. చంపుతారనే భయంతో గంగమ్మ గుడిలో తలదాచుకున్న మాపై రాళ్లు విసిరి, బూతులు తిడుతూ నానా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనే నెపంలో బడుగు బలహీన వర్గాలు, వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ పచ్చ మూకలు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. దాడులు జరిగిన విషయం తెలిసినా జిల్లా ఎస్పీ బిందుమాదవ్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు సిబ్బంది పెంచాలని విన్నవించినా పెడచెవిన పెట్టారని, పోలీసుల వైఫల్యంతోనే గ్రామాల్లో దాడులు జరిగాయని అన్నారు. ఈ గ్రామానికి ప్రత్యేక బలగాలు పెంచాలని ఎస్పీకి విన్నవించినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా ఎస్పీ గ్రామాన్ని ఎందుకు సందర్శించలేదని, 24 గంటల్లో గ్రామానికి వచ్చి దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే ధర్నా చేపట్టి న్యాయం కోసం పోరాడతామని అన్నారు. యరపతినేని శ్రీనివాసరావు కొజ్జాలాగా ఆడవాళ్లపై దాడులు చేయించారని, దమ్ముంటే ఎన్నికల బరిలో ఉన్నా తమను ఢీకొనాలని అన్నారు. దాడులు ఆపకుంటే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవం అని చెప్పే జంగా కృష్ణమూర్తి ఘటనపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో టీడీపీ పచ్చమూకలు దాడులు జరిపిన ఇళ్లను పరిశీలించి, బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో 'సువర్ణా'ధ్యాయం

- ఒకే టోర్నీలో నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్న ఇద్దరు క్రీడాకారులు
- షేక్ ఆసియా, భరత్ కుమార్ అరుదైన రికార్డు
- క్రీడాభిమానుల అభినందనల వెల్లువ


పతకాలు సాధించిన భరత్ కుమార్, షేక్ ఆసియా

మంగళగిరి: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచే అరుదైన రికార్డును ఆ ఇద్దరు క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. ఒకే టోర్నీలో నాలుగేసి బంగారు పతకాలు సాధించి సత్తాచాటారు. ఈ విషయాన్ని పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ కొమ్మాకుల విజయ భాస్కరరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి షేక్ సంధానితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 5 నుంచి 11 వరకు హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ యూనివర్శిటీ పోటీల్లో డాక్టర్ షేక్ ఆసియా, పి భరత్ కుమార్ పాల్గొన్నారు. ఆసియా 69 కేజీల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించారు. మంగళగిరికి చెందిన పి భరత్‌కుమార్ 59 కేజీల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. వీరిద్దరినీ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ,ప్రతినిధులు గంటా వెంకటేశ్వరరావు, సకల కోటేశ్వరరావు, ఆర్ఎన్ వంశీకృష్ణ తదితరులు మంగళవారం అభినందించారు.